క్లుప్తంగా

శివాలయ వార్షికోత్సవం



ప్రత్యేక అలంకరణలో స్ఫటికలింగం

మద్రిపాలెం: జీవీఎంసీ 51వ వార్డు గాంధీనగర్ హరిహర క్షేత్రంలో కొలువై ఉన్న శివాలయ మూడో వార్షికోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. వేకువజాము నుంచి ఆలయంలో స్ఫటికలింగానికి ప్రత్యేక అభిషేకాలు చేశారు. పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చి శివయ్యకు అభిషేకాలు, పూజలు జరిపారు. అనంతరం కమిటీ సభ్యులు భక్తులకు ప్రసాద వితరణ చేశారు.

శివుడు, నందీశ్వరుడికి ప్రత్యేక పూజలు రేపు



అలంకరణలో శివలింగం

సీతమ్మధార: నక్కవానిపాలెం ఉమా నీలకంఠేశ్వర స్వామి దేవస్థానంలో బుధవారం త్రయోదశి సందర్భంగా అమావాస్య ముందురోజు నందీశ్వరుడు, శివుడికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తామని ప్రధాన అర్చకుడు రామారావు శర్మ తెలిపారు. ఆ రోజు సాయంత్రం 6 గంటల నుంచి ప్రదోషకాల పూజలు చేస్తామని పేర్కొన్నారు. కొన్ని రకాల దోషాలు ఉన్న భక్తులు ఈ పూజల్లో పాల్గొనాలని కోరారు. ప్రత్యేక పూజల కోసం ఆలయంలో అన్ని ఏర్పాట్లు చేశామని చెప్పారు.

దుర్గమ్మ సారె ఊరేగింపు



దొండపర్తిలోని సారె ఊరేగిస్తున్న భక్తులు

సీతమ్మధార: జీవీఎంసీ 27వ వార్డు దొండపర్తిలోని శ్రీదుర్గమ్మ ఉత్సవాలలో భాగంగా సోమవారం సారె ఊరేగింపు ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా అధిక సంఖ్యలో భక్తులు పుర వీధుల్లో అమ్మవారికి సారెను ఊరేగింపుగా తీసుకెళ్లి సమర్పించారు. రాత్రి తొలేళ్ల ఉత్సవం ఘనంగా ప్రారంభమైంది. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారి ఉత్సవాల సందర్భంగా చుట్టుపక్కల ప్రాంతాల్లో సందడి వాతావరణం నెలకొంది. వీధులను విద్యుద్దీపాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు అల్లూరి సత్యనారాయణరెడ్డి, కారాల మహేష్, చిరంజీవి, పాలికల సింహాచలం, గురునాథరెడ్డి, టి.లలితాకుమార్, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

యూజీడీ లీకుతో అవస్థలు



ద్వారకానగర్ పౌర గ్రంథాలయం వద్ద లీకవుతున్న యూజీడీ మ్యాన్‌హోల్

సీతంపేట: ద్వారకానగర్ పౌర గ్రంథాలయం వద్ద రహదారిలో యూజీడీ మ్యాన్‌హోల్ తరచూ లీకవుతోంది. మురుగు నీరు రోడ్డెక్కి ప్రవహిస్తుండటంతో లైబ్రరీకి వచ్చే విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. ఎన్నిసార్లు లీకవుతున్నా.. తూతూ మంత్రంగా మ్యాన్‌హోల్‌ను శుభ్రం చేసి చేతులు దులిపేసుకుంటున్నారు. మళ్లీ కొద్ది రోజులకే సమస్య పునరావృతవుతోందని విద్యార్థులు అంటున్నారు. సంబంధిత అధికారులు స్పందించి శాశ్వత పరిష్కారం చూపాలని స్థానికులు కోరుతున్నారు.

కరుణించే తల్లి కుంచుమాంబ

- ఘనంగా అక్కయ్యపాలెం గ్రామదేవత తొలేళ్లు సంబరం
- నేడు ప్రధాన పండగ
- జాతర మహోత్సవానికి భారీ ఏర్పాట్లు



అక్కయ్యపాలెం జగన్నాథపురంలో కొలువైన కుంచుమాంబ అమ్మవారు



తొలేళ్ల పండగలో భాగంగా అమ్మవారి పూల ఘటాన్ని ఊరేగిస్తున్న సంఘ సభ్యులు, భక్తులు

సీతంపేట: భక్తులను కరుణించి కాపాడే అక్కయ్యపాలెం గ్రామదేవత కుంచుమాంబ అమ్మవారి ప్రధాన పండగ మహోత్సవానికి గౌరీ సేవా సంఘం ఘనంగా ఏర్పాట్లు పూర్తి చేసింది. అక్కయ్యపాలెం జగన్నాథపురంలోని మూడు గుళ్ల ప్రాంగణంలో కొలువైన అమ్మవారిని, ఆలయ పరిసరాలను విద్యుత్ దీపాలు, వేప మండలు, పూలదండలతో ముస్తాబు చేశారు. అక్కయ్యపాలెం మెయిన్ రోడ్, జగన్నాథపురం, 80 ఫీట్ రోడ్, శ్రీనివాసనగర్, రామాలయం, కర్రివాని బ్రిడ్జి, జగ్గారావు బ్రిడ్జి ప్రాంతాల రహదారులన్నింటినీ విద్యుత్ దీపాలు, ఎల్‌ఈడీ ఫ్లెక్సీలతో అలంకరించారు. ఆలయం వద్ద షామియానాలు, కొబ్బరి ఆకులతో చలువ పందిర్లు సిద్ధం చేశారు. భక్తుల రద్దీ దృష్ట్యా ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టారు.

పురవీధుల్లో తొలేళ్ల ఊరేగింపు

ఈ సందర్భంగా గౌరీ సంఘం అధ్యక్షుడు కొయిలాడ వేణుగోపాల్ మాట్లాడుతూ సోమవారం అమ్మవారి తొలేళ్ల సంబరం ఘనంగా నిర్వహించామని, మంగళవారం ప్రధాన పండగ వైభవంగా జరిపేందుకు అన్ని ఏర్పాట్లు చేశామని తెలిపారు. స్థానిక రామాలయం సదరం పట్టు నుంచి సోమవారం సాయంత్రం అమ్మవారి తొలేళ్ల ఊరేగింపు ప్రారంభమై, అమ్మవారి పూల ఘటం ఆలయం వరకు కొనసాగింది. గ్రామ పూజారి బొడ్డేటి రాము, భాస్కర్, సూరిశెట్టి శ్రీను పూల ఘటాన్ని తలపై మోశారు. ముందుగా ఘటాలకు ప్రత్యేక పూజలు జరిపారు.

సంప్రదాయ రీతిలో ప్రధాన పండగ

కుంచుమాంబ అమ్మవారి ప్రధాన పండగ మంగళవారం అంగరంగ వైభవంగా నిర్వహించనున్నామని ఉత్సవ కమిటీ తెలిపింది. ఉదయం అమ్మవారికి జల, పంచామృతాభిషేకాలు, అర్చనలు, అభిషేకాలు జరుగుతాయి. ఉదయం నుంచే అమ్మవారికి భక్తులు మొక్కులు చెల్లించుకోవచ్చు. సాయంత్రం ఆర్కెస్ట్రా, బుర్రకథలు, డ్యాన్స్ బేబీ డ్యాన్స్ వంటి స్టేజి ప్రోగ్రామ్స్ ప్రధాన రహదారుల్లో ఏర్పాటు చేశారు. వీటితోపాటు గరిడీలు, పులివేషాలు, కోలాటం, తప్పెటగుళ్లు, తీన్‌మార్, నవదుర్గల అవతారాలు, బిందెల డ్యాన్స్ వంటి సంప్రదాయ, సాంస్కృతిక కార్యక్రమాలు ఊరేగింపులో ప్రత్యేక ఆకర్షణగా నిలువనున్నాయి. భక్తులంతా విచ్చేసి పండగను జయప్రదం చేయాలని ఉత్సవ కమిటీ సభ్యులు కోరారు. గౌరీ సంఘం గౌరవ అధ్యక్షుడు పాలమరశెట్టి ప్రసాద్, అధ్యక్షుడు కొయిలాడ వేణుగోపాల్, ప్రధాన కార్యదర్శి ఆడారి పారుపల్లి రవి, కోశాధికారి పెంటకోట సత్యప్రసాద్, ఉత్సవ కమిటీ చైర్మన్ రాజగిరి సింహాచలం, వైస్ చైర్మన్ మళ్ల త్రినాథరావు, ఆడిటర్ పెంటకోట సత్యనారాయణ, డిప్యూటీ ప్రెసిడెంట్ పిళ్లా పకీరు నాయుడు ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్నారు.



విద్యుద్దీపాలంకరణలో అమ్మవారి ఆలయం

ఘనంగా బక్రీద్ వేడుకలు



53వ వార్డులో బక్రీద్ ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

సీతంపేట: త్యాగానికి ప్రతీకగా జరుపుకునే బక్రీద్ పండగను సోమవారం ముస్లింలు ఘనంగా నిర్వహించారు. జీవీఎంసీ 44వ వార్డు ముస్లిం తాటిచెట్లపాలెంలోని మసీద్ ఈ క్యూబాలో కమిటీ ఆధ్వర్యంలో పెద్ద సంఖ్యలో ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఉదయం 8 గంటల నుంచే ముస్లింలు పెద్ద సంఖ్యలో ఈ క్యూబా మసీదు, ఈద్గాల్లో ప్రార్థనలు చేసి ఒకరినొకరు ఆలింగనం చేసుకుని ఈద్ ముబారక్ అంటూ బక్రీద్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ సందర్భంగా ఈదుల్ అజహా ప్రత్యేక నమాజ్ ఆచరించారు. పెద్ద సంఖ్యలో ముస్లిం యువత సంప్రదాయ వస్త్రధారణలో సందడి చేశారు. అక్కయ్యపాలెం చిన్నూరు మసీదులో టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మహమ్మద్ నజీర్, 26వ వార్డు కార్పొరేటర్ ముక్కా శ్రావణి, ముక్కా కిషోర్ కుమార్ ప్రార్థనలో పాల్గొన్నారు. అనంతరం ముస్లింలకు పండ్ల రసాన్ని అందజేశారు.

ముస్లింల శాంతి ర్యాలీ

మద్రిపాలెం: జీవీఎంసీ 53వ వార్డు జాకీర్‌హుస్సేన్ నగర్ మసీద్, మద్రిపాలెం మసీద్‌ల ఆధ్వర్యంలో ఈద్ ఉల్ బక్రీద్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. మసీదుల్లో ఫజర్ నమాజ్‌ను ఆచరించిన ముస్లింలు మద్రిపాలెం పరిసర ప్రాంతాల్లో శాంతి ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఈద్గా వద్దకు చేరుకుని ఈద్ నమాజ్‌ను ఆచరించారు. హఫీజ్(మత గురువు) హఫ్రోజ్ తక్రీర్ పఠించారు. నమాజ్‌ను ఆచరించిన వారు సమీప శ్మశానవాటికకు చేరుకుని పూర్వీకుల ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థనలు చేశారు. ఈ వేడుకల్లో ఉత్తర ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు, టీడీపీ పార్లమెంటరీ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి పాలమరశెట్టి శ్రీనివాసరావు పాల్గొని ముస్లింలకు ఈద్ ముబారక్ శుభాకాంక్షలు తెలిపారు. ముస్లింల సంక్షేమానికి అన్ని విధాలుగా కృషి చేస్తామని వారు హామీ ఇచ్చారు. మస్జీద్ ఈ అల్ ఖదీర్ అధ్యక్షుడు మున్నా, బీజేపీ వార్డు అధ్యక్షుడు గోపాలరావు, జనసేన వార్డు అధ్యక్షుడు దివాకర్ పాల్గొన్నారు.



చిన్నూరు మసీదు వద్ద ముస్లింలకు పండ్ల రసం అందజేస్తున్న నాయకులు

పైడిమాంబ మారువారం నేడు

సీతంపేట: సీతంపేట గ్రామ దేవత పైడిమాంబ అమ్మవారి పండగ మహోత్సవంలో భాగంగా మంగళవారం మారువారం పండగ నిర్వహిస్తున్నట్లు శ్రీకృష్ణ యువజన సేవా సంఘం ప్రతినిధులు తెలిపారు. అమ్మవారి ఆలయంలో ప్రాతఃకాలం నుంచి భక్తుల గోత్రనామాలతో ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరుగుతాయన్నారు. ఉదయం 9 గంటల నుంచి అమ్మవారికి అభిషేకాలు, కుంకుమార్చన, 10 నుంచి 12 గంటల మధ్య అమ్మవారి శాంతి యజ్ఞం, హోమాది కార్యక్రమాలు, నవ చండీ హోమం జరుగుతాయని పేర్కొన్నారు. సాయంత్రం 5 నుంచి 8.30 గంటల వరకు ప్రత్యేక పూజా కార్యక్రమాలు, లలితా సహస్రనామ పఠనం నిర్వహిస్తామని, భక్తులు పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

నేడు కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన

దాబాగార్డెన్స్: బురుజుపేట కనకమహాలక్ష్మికి 108 స్వర్ణ పుష్పాలతో మంగళవారం అష్టదళ పద్మారాధన నిర్వహించనున్నారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు జరిగే ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,116 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలి. భక్తులు యూనియన్ బ్యాంక్ అకౌంట్ నంబర్ 060810011006681 టౌన్ కొత్తరోడ్డు బ్రాంచి, ఐఎఫ్‌ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806081కు ఆన్‌లైన్ పేమెంట్ చేసి, పేరు, గోత్రం తెలిపితే వారి పేరిట పూజ చేస్తారు. పూర్తి వివరాలకు 0891–2711725, 2566514 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని ఆలయ అధికారులు కోరారు.

ఇష్టారాజ్యంగా పార్కింగ్‌తో ఇబ్బందులు



జోన్-5లో సౌకర్య కేంద్రం వద్ద ఇష్టారాజ్యంగా పార్క్ చేసిన వాహనాలు

కంచరపాలెం: జీవీఎంసీ 41వ వార్డు జ్ఞానాపురం జోన్ – 5 జోనల్ కార్యాలయంలో సౌకర్యం కేంద్రం వద్ద ఇష్టారాజ్యంగా వాహనాలు పార్కింగ్ చేయడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఇంటి పన్నులు, మంచినీటి పన్నులు, ఇతర సేవలు వినియోగించుకోవడానికి ఇక్కడకు పలువురు వస్తుంటారు. పార్కింగ్ స్థలం వద్దే నగదు చెల్లింపుల కౌంటర్ ఉండడంతో వినియోగదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఆన్‌లైన్‌లో ఇబ్బందులు తలెత్తితే గంటల కొద్దీ నిరీక్షించాల్సి వస్తోంది. సౌకర్యం కేంద్రం వద్ద జోన్ – 5 సిబ్బందే అడ్డదిడ్డంగా తమ ద్విచక్ర వాహనాలు పార్కింగ్ చేస్తున్నారు. వాహనాలు కేంద్రానికి దూరంగా పార్కింగ్ చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

నేత్రపర్వం.. పైడిమాంబ తొలేళ్ల సంబరం



పైడిమాంబ అమ్మవారి ప్రతిమలతో భక్తుల ఊరేగింపు,



పుష్పాలతో అలంకరించిన అమ్మవారి ఘటం

కంచరపాలెం: ఐటీఐ జంక్షన్ పరిధి సంకురపేటవాసుల ఆరాధ్య దైవం పైడిమాంబ అమ్మవారి తొలేళ్ల ఉత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారి ప్రతిమల ఊరేగింపును కనులపండువగా జరిపించారు. గ్రామాధ్యక్షుడు పిల్లి మురళి నేతృత్వంలో అమ్మవారి తొలి ప్రతిమకు పూజలు చేసి, ఘటాల ఊరేగింపు ప్రారంభించారు. సాయంత్రం 4 గంటలకు ప్రారంభమైన ఈ ఉత్సవంలో అమ్మవారి ప్రతిమలను దొండపర్తి, జగదాంబ, అల్లిపురం, కాన్వెంట్ కూడలి, జ్ఞానాపురం, రామ్మూర్తిపంతులపేట, కంచరపాలెం నేతాజీ ఫ్లైఓవర్, ఊర్వశి కూడలి మీదుగా ఊరేగించి, ఐటీఐ జంక్షన్‌లోని ఆలయం ఆవరణలో అమ్మవారి ప్రతిమలను నిలిపారు. అనంతరం అమ్మవారి ఘటాలకు పుట్ట బంగారం వద్ద పూజారి చంద్రశేఖర్ ప్రత్యేక పూజలు చేశారు. తొలేళ్ల ఉత్సవంలో పలు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు. నేలవేషధారణలు ఆకట్టుకున్నాయి. ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా పోలీసులు చర్యలు చేపట్టారు.

నేడు ప్రధాన జాతర

మంగళవారం ప్రధాన జాతరను నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఉత్సవ ఏర్పాట్లను గ్రామ కమిటీ పాలకవర్గ సభ్యులు రమణ, శంకర్, రాము, సూరిబాబు, సముద్రాలు, తంగేటి శ్రీను, కుమార్, అప్పలరాజు పర్యవేక్షించారు.

దళితులకు పథకాలు అమలు చేయాలి

దాబాగార్డెన్స్: దళితులకు సంబంధించి నిలిపివేసిన పథకాలను వెంటనే అమలు చేయాలని కుల వివక్ష పోరాట సమితి సభ్యులు డిమాండ్ చేశారు. డాబాగార్డెన్స్ అంబేడ్కర్ విగ్రహం వద్ద జీవో 596 రద్దు చేయాలని, ఎస్సీ ఎస్టీ సబ్ ప్లాన్ నిధులు సక్రమంగా అమలు చేయాలని కోరుతూ సోమవారం వినూత్న రీతిలో నిరసన చేపట్టారు. కేవీపీఎస్ విశాఖ జిల్లా కమిటీ ప్రధాన కార్యదర్శి తిరుకోటి చిరంజీవి మాట్లాడుతూ విదేశీ విద్య, బెస్ట్ అవైలబుల్ స్కూల్స్, కులాంతర వివాహాల ప్రోత్సాహం, ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరారు. దళితుల భూములు దళితులకే ఇవ్వాలని, దళితుల భూములకు రక్షణ కల్పించాలన్నారు. కార్యక్రమంలో కేవీపీఎస్ విశాఖ జిల్లా ఉపాధ్యక్షుడు వై.రాజు, ఎం.సుబ్బారావు, శేఖర్, నర్సింగరావు, సరోజిని తదితరులు పాల్గొన్నారు.

అప్పన్న సన్నిధిలో సంగీత దర్శకుడు రవిశంకర్



కప్పస్తంభానికి మొక్కుకుంటున్న రవిశంకర్

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని సోమవారం సినీ సంగీత దర్శకుడు రవిశంకర్ దర్శించుకున్నారు. ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. ఆయన పేరిట అర్చకులు స్వామికి పూజలు నిర్వహించి స్వామివారి ప్రసాదం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 2008లో ప్రియమణి, శరత్‌కుమార్,కృష్ణంరాజు ప్రధాన పాత్రల్లో విడుదలైన చండీ సినిమా ద్వారా సంగీత దర్శకుడిగా పరిచయం అయినట్టు తెలిపారు. బాలీవుడ్‌లో అమితాబచ్చన్ నటించిన సర్కార్–3, తెలుగులో నాగార్జున హీరోగా విడుదలైన ఆఫీసర్ సినిమాతో పాటు కోలీవుడ్‌లో డాక్టర్ శివ రాజ్‌కుమార్‌తో కిల్లింగ్ వీరప్పన్ అనే సినిమాకు సంగీత డైరెక్టర్‌గా పనిచేశానన్నారు. ప్రస్తుతం ప్యాన్ ఇండియా మూవీగా వస్తున్న రామజన్మభూమి, వరదరాజుగోవిందం అనే సినిమాకు సంగీతం సమకూర్చినట్టు తెలిపారు.

కూరగాయల ధరల మోత



సీతమ్మధార రైతుబజార్‌లో టమాటా స్టాల్

సీతమ్మధార: వేసవి సీజన్ ముగుస్తున్న తరుణంలో కూరగాయల ధరలు ఒక్కసారిగా పెరగడంతో వినియోగదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రధానమైన పండగలు లేని ఈ నెలలోనే కూరగాయల ధరలు ఇలా ఉంటే.. వచ్చే నెల ఇంకెంత పెరుగుతాయోనని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షాలకు పలు ప్రాంతాల్లో పంటలు దెబ్బతిని దిగుబడులు తగ్గి, డిమాండ్ పెరిగిన కారణంగా ధరలు పెరుగుతున్నాయని భావిస్తున్నారు. టమాటా తదితర కూరగాయల ధరలు ఆకాశన్నంటుతున్నాయని విచారం వ్యక్తం చేస్తున్నారు. పలు రకాల కూరగాయల ధరల కిలో రూ.50 పైమాటే పలకడం గమనార్హం. రైతుబజార్‌లో సోమవారం కిలో టమాటా ధర రూ.52 పలికింది. గత వారం రూ.44గా ఉంది. అల్లం ప్రస్తుతం రూ.170 పలుకుతోంది. కాకరకాయల ధర రూ.30 నుంచి రూ.50కు పెరిగింది. దొండకాయలు కిలో రూ.24 నుంచి రూ.40కు, పచ్చిమిర్చి రూ.50 నుంచి రూ.60, క్యాప్సికమ్ రూ.70 నుంచి రూ.90కు పెరిగింది. ఉల్లిపాయల ధర కిలో రూ.35 పలుకుతోంది.

బహిరంగ మార్కెట్‌లోనూ రెక్కలు..

రైతుబజార్, పూర్ణా మార్కెట్, జ్ఞానాపురం హోల్‌సేల్ మార్కెట్‌లో కూడా కూరగాయల ధరలు భగ్గుమంటున్నాయి. బహిరంగ మార్కెట్‌లో టమాటా ధర రూ.60 నుంచి రూ.70 పలుకుతోంది. ఉల్లిపాయల ధర రూ.40 నుంచి రూ.50, దొండకాయల ధర రూ.50 నుంచి రూ.60 వరకు ఉంది.

భూమిని కాపాడే బాధ్యత మనదే



పర్యావరణ పోస్టర్లు ప్రదర్శిస్తున్న విద్యార్థులు, పీఆర్ గార్డెన్స్ యూత్, జేవీ రత్నం, టీం సభ్యులు

మద్రిపాలెం: భూమిని కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపైనా ఉందని గ్రీన్ క్లైమేట్ టీం ఎన్‌జీవో వ్యవస్థాపక కార్యదర్శి జేవీ రత్నం అన్నారు. 49వ వార్డు పట్టాభిరెడ్డి తోటలో పట్టాభిరెడ్డి గార్డెన్స్ యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ పర్యావరణ మాసోత్సవాల్లో భాగంగా సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మన భూమిని మనమే కాపాడుకోవాలని, ప్రతి ఒక్కరూ ప్రకృతి ఆధారిత పంటలు పండించిన ఆహారాన్నే ఆరగించాలన్నారు. విశాఖలో అమలవుతున్న ఎకో వైజాగ్‌లో భాగంగా మొక్కలు నాటి, వాటిని పెంచి విజయవంతం చేయాలని కోరారు. అడ్వకేట్ సుబ్బారెడ్డి మాట్లాడుతూ ఈ ఏడాది నుంచి ప్రతి ఏటా 500 మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు కృషి చేస్తానన్నారు. అందరూ పర్యావరణ హితంగా జీవించాలని పిలుపునిచ్చారు. విద్యార్థులకు పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించాలన్నారు. సంస్థ కార్యదర్శి శ్రీనివాసరావు మాట్లాడుతూ పట్టాభిరెడ్డి తోట అనే పేరు నిలబెట్టేందుకు తమ ప్రాంతానికి చెందిన వారందరినీ కలిపి ఒక పథకం ప్రకారం పచ్చని తోటగా తీర్చిదిద్దుతామన్నారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు కోటేశ్వరరావు, కోశాధికారి గణేష్, సహాయ కార్యదర్శి సంతోష్, పలువురు విద్యార్థులు పాల్గొని మాట్లాడారు.

సేఫ్టీ కోర్సుల విద్యార్థులకు ప్రాక్టికల్స్



సేఫ్టీ ప్రాక్టికల్స్ తరగతుల్లో పాల్గొన్న విద్యార్థులు



కెమికల్ సేఫ్టీని వివరిస్తున్న నిపుణుడు

మురళీనగర్: కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగ్ ఇన్‌స్టిట్యూట్‌లో నిర్వహిస్తున్న సేఫ్టీ కోర్సుల విద్యార్థులకు ప్రాక్టికల్స్ నిర్వహిస్తున్నట్లు గైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వెంకటరమణ తెలిపారు. ఆదివారం నుంచి విద్యార్థులకు థియరీకి అనుగుణంగా ప్రాక్టికల్స్ షెడ్యూలు నిర్వహిస్తున్నామన్నారు. ఫైర్ సేఫ్టీ, ఇండస్ట్రియల్ సేఫ్టీ, కెమికల్ ఇంజినీరింగ్ సేఫ్టీ కోర్సుల్లో విద్యార్థులు ఈ ప్రాక్టికల్స్‌లో ప్రత్యక్షంగా పాల్గొని నైపుణ్యాలను సాధిస్తున్నారని, ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నామని చెప్పారు. కోర్సు కో ఆర్డినేటర్ ఎ.వరహాలు పర్యవేక్షణలో సేఫ్టీ కోర్సు ఫ్యాకల్టీ డి.తులసీరావు విద్యార్థులకు ప్రయోగాత్మక బోధన నిర్వహించారు.

జాబ్ మేళాకు విశేష స్పందన



జాబ్ మేళాకు హాజరైన విద్యార్థులు

మద్దిలపాలెం: డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాలలో జవహర్ నాలెడ్జ్ సెంటర్, మ్యాజిక్ బస్ ఫౌండేషన్ సంయుక్తంగా సోమవారం నిర్వహించిన మెగా జాబ్ మేళాకు విశేష స్పందన లభించింది. 1,230 మంది విద్యార్థులు రిజిస్ట్రేషన్ చేసుకుని ఇంటర్వ్యూలకు హాజరయ్యారని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ.విజయబాబు తెలిపారు. వారిలో 364 మంది వివిధ కంపెనీల్లో ఉద్యోగాలు పొందారన్నారు. జవహర్ నాలెడ్జ్ సెంటర్ కో ఆర్డినేటర్ జి.శ్రీనివాసరావు, మ్యాజిక్ బస్ ఫౌండేషన్ ప్లేస్‌మెంట్ కో–ఆర్డినేటర్ రాజు జాబ్ మేళా విజయవంతానికి కృషి చేశారన్నారు. ఇలాంటి క్యాంపస్ డ్రైవ్‌లను మరిన్ని కళాశాల వేదికగా నిర్వహించాలని ఆయన కోరారు.

జోరుగా డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు



వాహన చోదకులకు డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్ట్ చేస్తున్న పోలీసులు

సీతమ్మధార: ద్వారకా జోన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో సోమవారం సాయంత్రం డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించారు. ఎస్‌ఐ భాస్కరరావు ఆధ్వర్యంలో ట్రాఫిక్ పోలీసులు వాహన చోదకులను తనిఖీ చేశారు. సాయంత్రం వేళల్లో పలువురు వాహన చోదకులు మద్యం తాగి వాహనాలు నడుపుతూ రోడ్డు ప్రమాదాలకు కారణమవుతున్నారు. ఈ నేపథ్యంలో కొంతకాలంగా ఆయా ప్రాంతాల్లో డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు జోరుగా నిర్వహిస్తున్నారు. ఫలితంగా నగరంలో రోడ్డు ప్రమాదాల సంఖ్య గణనీయంగా తగ్గిందని పోలీసు ఉన్నతాధికారులు చెబుతున్నారు. స్థానిక పాలాక్ స్కూల్, గురుద్వారా, ద్వారకానగర్, అల్లూరి సీతారామరాజు జంక్షన్ తదితర కూడళ్ల వద్ద పోలీసులు వాహన చోదకులకు డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్ట్‌లు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ భాస్కరరావు మాట్లాడుతూ వాహన చోదకులు విధిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించి పోలీసు శాఖకు సహకరించాలని కోరారు. మద్యం తాగి వాహనాలు నడపడంతోటి ప్రయాణికులకు కూడా ప్రమాద కరమని హెచ్చరించారు. కుటుంబ సభ్యుల శ్రేయస్సు దృష్ట్యా డ్రంక్ అండ్ డ్రైవ్ అలవాటు మానుకోవాలని ఆయన హితవు పలికారు.